ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ.25.12.24 సమయం.19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. తమ సుపరిపాలన బీజేపీ ప్రభుత్వాలకు గుర్తింపు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
2. తెలంగాణలోని మెదక్ జిల్లాలో 655 మంది రైతులు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే...చరిత్ర సృష్టించారని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు.
3. దేశంలో అంతర్గత శాంతిని నెలకొల్పడంలో సీఆర్పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
4. కజకిస్థాన్‌లో ఈరోజు జరిగిన విమాన ప్రమాదంలో పదుల సంఖ్యలో ప్రయాణికులు మరణించారు.

---------------------------

**REV. EVE PM-MP**

తమ సుపరిపాలన బీజేపీ ప్రభుత్వాలకు గుర్తింపు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఇది ఒకరోజు కార్యక్రమం కాదని పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి సందర్భంగా మధ్యప్రదేశ్ లోని ఖజురహో లో దేశంలోని మొట్టమొదటి, ప్రతిష్ఠాత్మక బహుళార్థ సాధక కెన్ బెత్వా జాతీయ నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధానమంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. దేశంలోని

మొట్టమొదటి ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించారు. 1,153 అటల్ గ్రామ్ సుశాసన్ భవనాల భూమి పూజను నిర్వహించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకార్థం స్టాంపు, నాణేన్ని కూడా ప్రధానమంత్రి విడుదల చేశారు. బిజెపి ప్రభుత్వాలను ఇతర పార్టీల ప్రభుత్వాలతో పోల్చాలని ప్రదానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచారు. సుపరిపాలన, ప్రజల పట్ల అంకితభావం కోసం బిజెపి ప్రభుత్వాలు ఎల్లప్పుడూ ప్రతి అంశంలో కష్టపడి పనిచేస్తున్నాయని అన్నారు. సుపరిపాలన, ఉత్తమ సేవల విషయంలో అటల్ బిహారీ వాజ్ పేయి ఎల్లప్పుడూ ప్రేరణగా ఉంటారని మోదీ అన్నారు. ఏడు దశాబ్దాల తర్వాత కూడా నీటి విషయంలో దేశంలోని అనేక రాష్ట్రాల మధ్య ఏదో ఒక వివాదం ఉందని అన్నారు. భారతదేశ నీటి వనరులు, నీటి నిర్వహణ , ఆనకట్టల నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి డాక్టర్ అంబేద్కర్ దార్శనికత, దూరదృష్టి గణనీయంగా దోహదపడ్డాయని అన్నారు. భారతదేశంలోని ప్రధాన నదీ లోయ ప్రాజెక్టుల అభివృద్ధిలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో పెరుగుతున్న నీటి సంరక్షణ అవసరాలను ఎన్నడూ పట్టించుకోలేదన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులందరికీ సౌకర్యాలు పెంచేందుకు, ఇక్కడికి సులభతరంగా ప్రయాణించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

**NSD**

---------------------------------

**RAJNATH - GOVERANCE DAY**

అటల్ బిహారీ వాజ్ పేయి నాయకత్వాన్ని యావత్ ప్రపంచం కొనియాడిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా లక్నో లోక్‌భవన్‌లో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో రక్షణ మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి విగ్రహానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటల్‌జీ భారతదేశానికి సుపరిపాలన అందించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ సందర్బంగా అన్నారు. వాజ్ పేయి ప్రభుత్వ హయాంలో వృద్ధి రేటు 8.4 శాతానికి చేరుకోవడం స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక విజయమని పేర్కొన్నారు.

**NSD**

----------------------

**JITENDRA SINGH - PANCHAYAT**

క్షేత్ర స్థాయి పాలనను బలోపేతం చేసేందుకు సుపరిపాలన దినోత్సవం సందర్భంగా ఈరోజు వికసిత్ పంచాయత్ కర్మయోగి కార్యక్రమాన్ని సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ప్రారంభించారు. సమర్థవంతమైన పాలనకు అవసరమైన సాధనాలు, జ్ఞానంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులను సన్నద్ధం చేయడం ద్వారా పంచాయతీ రాజ్ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం ఈ చొరవ లక్ష్యం. ఈ సందర్భంగా డాక్టర్ సింగ్ మాట్లాడుతూ దీర్ఘకాలిక, అర్థవంతమైన మార్పును తీసుకురావడానికి క్షేత్ర స్థాయి నుండి పాలనా సంస్కరణలు ప్రారంభం కావాలని అన్నారు. వికసిత్ పంచాయత్ కర్మయోగి చొరవ, వినూత్న సాధనాలు, సామర్థ్యాన్ని పెంపొందించే చట్రాల ద్వారా

పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుందని ఆయన అన్నారు.

**NSD**

-------------------------

**ఉప రాష్ట్రపతి**

తెలంగాణలోని మెదక్ జిల్లాలో 655 మంది రైతులు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు. ఈ గ్రామం చిన్నది కాదని, దేశానికే మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ గ్రామ రైతులు సేంద్రియ సాగులో తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి, మార్పు సాధించిందని ప్రశంసించారు. ఈ గ్రామ సేంద్రియ సాగు రైతులందరూ మూడు రోజుల పాటు ఢిల్లీలో తన స్వగృహానికి అతిధులుగా రావాలని కోరారు. తనకు ఈ 655 మంది సేంద్రియ రైతులు, తునికి గ్రామ రైతులు ప్రత్యేక అతిధులని, వారికి మూడు రోజుల పాటు ఢిల్లీలో అతిధ్యం ఇస్తున్నానన్నారు. త్వరలో జపాన్, జర్మనీ దేశాలను వెనక్కు నెట్టి ప్రపంచంలో మూడవ ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఆవిర్భవించబోతుందన్నారు. గాంధీ జీ స్వదేశీ నినాధ స్ఫూర్తితో వోకల్ ఫర్ లోకల్ కు ప్రధానమంత్రి మోదీ పిలుపునిచ్చారన్నారు.

**PTC**

-----------------------------

**SHAH - CRPF**

దేశంలో అంతర్గత  శాంతిని నెలకొల్పడంలో సీఆర్పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాల కార్యాచరణ, పరిపాలనా సామర్థ్యంపై అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. నక్సలిజాన్ని అరికట్టడంలో, ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కాశ్మీర్‌లో శాంతి, సుస్థిరతను పునరుద్ధరించడంలో కేంద్ర సాయుధ పారామిలటరీ దళం ప్రశంసనీయమైన కృషి చేసిందని మంత్రి అన్నారు. సమావేశంలో కారుణ్య నియామకాలతో సహా  అమరవీరులైన జవాన్ల కుటుంబాల కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను హోం మంత్రికి సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనిష్ దయాళ్ సింగ్ వివరించారు.

**NSD**

---------------------------

**EARLY SHAH - AGRICULTURE COOPERATIVE**

దేశంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత లేని కాలంలోనే మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 'స్వర్ణిం చతుర్భుజ్ మార్గ్'ని ప్రారంభించారని కేంద్ర సహకార మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని పూసాలో కొత్తగా ఏర్పాటు చేసిన పదివేలకు పైగా బహుళార్ధ సాధక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సొసైటీలు, డెయిరీ,  మత్స్య సహకార సంఘాలను మంత్రి జాతికి అంకితం చేశారు. కొత్తగా ఏర్పాటైన సహకార సంఘాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, రూపే కిసాన్ క్రెడిట్ కార్డు లు,  మైక్రో ATMలను కూడా షా పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సాధనాలు పంచాయతీలలో రుణ సేవలను సులభంగా పొందడానికి,  ఆర్థిక సాధికారతను

ప్రోత్సహించడానికి రూపొందించారు. ఇవి గ్రామీణ ప్రజలు వివిధ పథకాల నుండి లబ్ది పొందేందుకు, దేశ ఆర్థిక ప్రగతిలో పాలుపంచుకోవడానికి కూడా వీలు కల్పిస్తాయి.

**NSD**

------------------------------

**EVE NDA LEADER – MEETING**

న్యూ ఢిల్లీలోని కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఈరోజు ఎన్డీయే ప్రముఖుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ తదితరులు పాల్గొన్నారు. కూటమి భాగస్వాముల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే ఈ సమావేశం లక్ష్యం.

**NSD**

----------------------

**EVE. KAZAKHSTAN PLACE CRASH**

కజకిస్థాన్‌లో ఈరోజు దాదాపు 70 మంది ప్రయాణీకులతో ప్రయాణిస్తున్న విమానం కూలిపోవడంతో పదుల సంఖ్యలో ప్రయాణికులు మరణించారు. విమానం బయలుదేరిన అజర్‌బైజాన్‌లో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన J2-8243 విమానం కజఖ్‌లోని అక్టౌ నగరానికి సమీపంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నించినప్పుడు మంటలు చెలరేగాయి. విమానం రష్యాలోని గ్రోజ్నీకి వెళ్తుండగా పొగమంచు కారణంగా దారి మళ్లించినట్టు ఎయిర్‌లైన్స్ తెలిపింది.

ల్యాండింగ్ గేర్ డౌన్‌తో విమానం అత్యంత వేగంతో భూమి వైపు వెళుతున్నట్లు ఫుటేజీ చూపిస్తోంది. ల్యాండ్ అయినప్పుడు మంటలు చెలరేగాయి. రష్యా మీడియా నుండి వచ్చిన నివేదికలు విమానం కూలిపోవడానికి ముందు పక్షుల గుంపుతో ఢీకొన్నాయని పేర్కొంటున్నాయి.  అయితే ఈ విషయాన్ని అధికారవర్గాలు ధృవీకరించలేదు. విమానంలో 62 మంది ప్రయాణికులు, ఐదుగురు  సిబ్బంది ఉన్నారని ఎయిర్‌లైన్స్ తెలిపింది. అయితే ఇతర నివేదికల ప్రకారం మొత్తం 72 మంది ఉన్నారు.

**NSD**

--------------------------

**CHRISTMAS– KERALA/ GOA/ NAGALAND**

ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండగను దేశ వ్యాప్తంగా సంప్రదాయ సిద్ధమైన భక్తి విశ్వాశాలతో జరుపుకుంటున్నారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయా, కరుణ భావాలతో కూడిన ఏసుక్రీస్తు బోధనలు శాశ్వతమైనవని క్రిస్మస్ గుర్తు చేస్తుందని రాష్ట్రపతి సామాజిక మాధ్యమంలో తెలిపారు. సమాజంలో సమానతను, సంతోషాన్ని, ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రజలను కోరారు. దేశ వ్యాప్తంగా ఈ పర్వదినం రోజున ప్రేమ, సామరస్యాలతో ఇళ్లు కళకళలాడాలని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ఆకాక్షించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమ సందేశంలో... ప్రతి ఒక్కరు శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఏసుక్రీస్తు బోధనలు చాటి చెబుతాయని తెలిపారు.

**NSD**

---------------------------------